జైలుకెళ్లొచ్చినా బుద్ధి మారలే

తాళం వేసిన ఇండ్లే టార్గెట్

ఘరానా దొంగ అరెస్ట్.. రిమాండ్ కు తరలింపు

వివరాలు వెల్లడించిన బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్

కేసు వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ తదితరులు

కుత్బుల్లాపూర్, మార్చి 27: తాళం వేసిన ఇండ్లే అతడి టార్గెట్.. పగలు రెక్కీ నిర్వహించి.. రాత్రుళ్లు చోరీలకు పాల్పడుతాడు. చోరీ చేసిన సొమ్ము అంతా ఓ చోట పెట్టి... తన అవసరం కోసం కొంచెం కొంచెం వాడుకుంటూ జల్సాలకు పాల్పడుతున్న ఓ ఘరానా దొంగ పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం... కూకట్‌పల్లి తులసినగర్ హెచ్ఎంటీ హిల్స్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ నాసర్ అలియాస్న సరోద్దీన్(34) వృత్తిరీత్యా సోఫా మరమ్మతులు చేస్తుంటాడు. ప్రవృత్తి మాత్రం దొంగతనాన్ని ఎంచుకున్నాడు. పగలంతా తాళం వేసిన ఇండ్లను రెక్కీ చేసి.. రాత్రి సమయంలో అదే ఇండ్లలోకి చొరబడి తలుపులు, కిటికీలు తన చాకచక్యంతో తొలగించి లోపలికి ప్రవేశించి విలువైన డబ్బు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లడంతో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు కూడా నమోదు అయ్యాయి. కాగా ఓ మహిళను హత్య చేసిన ఘటనలో కీలకంగా ఉండటంతో పీడీ యాక్ట్ తో ఏడాది పాటు జైలు జీవితం కూడా గడిపాడు. అయినా తన తీరు మారకుండా బయటకు వచ్చాక తిరిగి దొంగతనాలకు పాల్పడటం మామూలుగా మారింది. దీనిలో భాగంగానే ఈనెల 22వ తేదీన అర్ధరాత్రి నిందితుడు బాచుపల్లిలోని కాకతీయ హిల్స్ సరోవర్ బిల్డింగ్ రాజీవ్‌గృహకల్ప రోడ్డులోని జీ-1 లో తలుపులు వేసిన ఓ ఇంట్లోకి ప్రవేశించి బలవంతంగా తలుపులు తెరిచి అల్మారాలోని దాదాపు రూ.20లక్షల విలువైన 25 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. ఆలస్యంగా తేరుకున్న బాధితులు ఈనెల 26వ తేదీన బాచుపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు భాగంగా పాత నేరస్థుల జాబితా ఆధారంగా నిందితుడిని పట్టుకొని విచారించారు. దీంతో దొంగలించిన సొమ్మును బౌరంపేటలోని ఎన్ పి రాయల్ ఫర్నిచర్ దుకాణానికి తీసుకెళ్లి పరిశీలించగా.. అందులో 20 తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణం ఉన్న బ్యాగును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేరస్తుడి పాత చరిత్ర..

2013లో సరూర్‌నగర్ పోలీసులు మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. 2016లో అతను నగ్మా అనే మహిళను వివాహం చేసుకుని ఒక బిడ్డకు తండ్రి అయ్యాడు. 2017లో రమ్య గ్రౌండ్ సమీపంలోని కేపీహెచ్ బీలో నౌషీన్ సోఫా, బెడ్ వర్క్స్ దుకాణాన్ని స్థాపించి తరువాత శోభారాణి అనే ఆమెను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు అప్పటికే వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో కుటుంబసభ్యుల మధ్య కొన్ని కుటుంబ వివాదాలు తలెత్తాయి. దీని కారణంగా అతను భారీ నష్టాన్ని చవిచూశాడు. ఈ నష్టాలను పూరించుకునేందుకు దొంగతనాల బాటపడ్డాడు. కేపీహెచ్‌బీ, బాచుపల్లి పరిధిలో ఆస్తి నేరాలకు పాల్పడ్డాడు. కేపీహెచ్‌బీ పోలీసులు అతడి పై పీడీ చట్టం కింద జైలుకు పంపారు. ఒక సంవత్సరం తర్వాత అంటే 2020లో అతడు జైలు నుంచి విడుదలై రెండో భార్య శోభారాణితో కలిసి ఉన్నాడు. వ్యాపారం మందకొడిగా ఉండటంతో అతడు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. అందువల్ల సులభంగా డబ్బు సంపాదించడానికి ఏదైనా దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. కానీ, పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. ఈ కేసును బాలానగర్ లోని ఐపీఎస్, డీసీపీ కె. సురేశ్‌కుమార్ మార్గదర్శకత్వంలో, కూకట్‌పల్లిలోని ఏసీపీ కె. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, బాచుపల్లి పీఎస్, డీఐ పీ. యాదయ్య గౌడ్, ఎస్‌హెచ్‌ఓ జె. ఉపేందర్ రావు, క్రైమ్ సిబ్బంది డి. చంద్రశేఖర్, డీస్ఐ టి.అంజయ్య, పీసీ టి. శ్రీనివాస్, పీసీ ఎం. కనకయ్యలను అభినందించి వారికి తగిన రివార్డులు ప్రకటించారు.

ముంబైలో శిక్షణ.. కేపీహెచ్‌బీ కాలనీలో దొంగతనం

పోలీసులకు చిక్కిన దొంగ.. 6 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

అరెస్ట్ అయిన జీవ గణేషన్

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 27: దొంగతనం చేయడంలో ముంబైలో శిక్షణ పొంది పలు దొంగతనాలు చేసిన ఓ వ్యక్తి.. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలో దొంగిలించిన 6 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకొని అతడిని రిమాండ్ కు తరలించారు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ లో కూకట్‌పల్లి ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడుకు చెందిన జీవ గణేషన్ (26) బతుకుదెరువు కోసం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు, ఇస్నాపూర్ కు చేరుకున్నాడు. మేస్త్రీ పనులు చేస్తుండగా, ముంబై నగరానికి చెందిన కుమార్ తో పరిచయం ఏర్పడింది. మేస్త్రీ పనులతో ఎక్కువ డబ్బు సంపాదించలేమని, ముంబైకి వస్తే దొంగతనాలు నేర్పిస్తానని కుమార్ చెప్పగా, అతడి మాటలు నమ్మిన జీవ గణేషన్ ముంబైకి చేరుకొని దొంగతనాలకు అలవాటు పడ్డాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నివసించే ఏరియాలను ఎంచుకొని... ల్యాప్‌టాప్‌లు, సెల్ ఫోన్లు దొంగిలిస్తూ వాటిని ఇస్నాపూర్ సమీపంలోని తోతానం గ్రామంలో రాజేందర్ అనే వ్యక్తికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఈనెల 23న కేపీహెచ్‌బీ కాలనీ1, 3వ ఫేజ్‌లలో రెండుచోట్ల ల్యాప్‌టాప్‌లను దొంగిలించి పారిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు చివరకు దొంగతనం చేసిన వ్యక్తి జీవ గణేషన్ గా తేల్చి పట్టుకున్నారు. నగరంలోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో 10 ల్యాబ్ టాప్లను దొంగిలించినట్లు తేల్చారు. అతడి వద్ద కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన 4 ల్యాప్ టాప్స్ లను కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన రెండు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇతను మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా 3 ల్యాబ్ టాప్ లను దొంగతనం చేసినట్లు పోలీసులు తేల్చారు. 2.5 లక్షల విలువైన 6 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి శిక్షణ ఇచ్చిన కుమార్ చనిపోగా, అతడి వారసత్వాన్ని కొనసాగిస్తూ జీవ గణేష్‌పలు దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని అభినందించాడు.

గాజులరామారంలో ప్రభుత్వభూములపై ఆరా తీస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రభుత్వ భూములు సర్వే చేయిస్తాం

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకుంటుందని, ఇందుకు సంబంధించి త్వరలోనే సర్వే చేయించి హద్దులు నిర్ణయిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. గురువారం మాదాపూర్‌లోని గుట్టలబేగంపేట, ఫిల్మ్‌నగర్‌లోని బస్తీవిప్పర్‌వ్యాలీ వద్ద ఉన్న చెరువు, శంషాబాద్ మండలంలోని తొండపల్లి గ్రామం, కుత్బుల్లాపూర్‌లోని గాజులరామారం గ్రామాల్లో ప్రభుత్వ భూములను కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూముల కబ్జా జరుగుతున్నట్లు హైడ్రాకు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో భూములను పరిశీలించి రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేసి భూముల వివరాలు తెలుసుకోవడమే కాకుండా ఎవరైనా ఆక్రమణలో ఉన్నట్టయితే వాళ్లను ఖాళీ చేయించాలన్నారు. భూమి తనది అని ఎవరైనా చెబితే సంబంధిత పత్రాలు చూపించాలని, రహదారులకు ఆటంకం లేకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయడం, ప్రహారీలు నిర్మించి కాపాడుతామన్నారు. ఆ తర్వాత ఉప్పల్ నల్లచెరువు అభివృద్ధి పనులను పరిశీలించి అటునుంచి పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కాచవానిసింగారంలో దివ్యానగర్ లేఔట్‌ను సందర్శించారు.

ఆబ్కారీ దాడులు.. ఐదుగురి అరెస్టు

ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ): డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతున్న ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు తాజాగా నగరంలోని పలుచోట్ల దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఐదుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు పరారీలో ఉన్న మరో ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. ఎస్‌టీఎఫ్ సీఐ భిక్షారెడ్డి కథనం ప్రకారం...నగరానికి చెందిన ఎస్.కె.మహ్మద్ రహీమ్, మహ్మద్ ఫ్రకుద్దీన్‌లు ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు నిందితులిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి అరెస్టు చేశారు. 2.78 గ్రాముల ఎండీఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ కేసులో సౌదీ అరేబియాకు చెందిన సఫాన్ , బెంగళూరుకు చెందిన డ్రగ్స్ సప్లయర్ ఇబ్రహీమ్ జహీర్‌లు ఉన్నట్లు గుర్తించి, వారిపై కూడా కేసు నమోదు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరు పరారీలో ఉన్నారు.

మరో కేసులో..

ధూల్‌పేట ప్రాంతానికి చెందిన కునాల్ సింగ్, వినోద్ సింగ్, హేమబాయ్‌లు గుట్టు చప్పుడు కాకుండా లోయర్ ధూల్‌పేట్, జుంగూర్ బస్తీలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు గురువారం వారి నివాసాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆ ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 1.302కిలోల గంజాయితో పాటు నాలుగు సెల్ ఫోన్లు, యాక్టివా హోండా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ కేసులో అనికేష్ సింగ్, అర్జిబాయ్, సరేన్, గణేశ్‌సింగ్‌లపై కూడా కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం వీరు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ భిక్షారెడ్డితో పాటు ఎస్సైలు బాలరాజు, సంధ్య, కానిస్టేబుళ్లు యాదగిరి, అనీఫ్, నితిన్, మహేశ్వర్, కౌశిక్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాగులు, మొబైల్ ఫోన్ల దొంగ అరెస్ట్

నిందితుడు రాజును అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

సిటీ బ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో రైళ్లలో దోపిడీకి పాల్పడుతున్న ఓ దొంగను రైల్వే పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి ఒక క్యారీ బ్యాగ్, ఒక లగేజీ బ్యాగ్, ఐదు సెల్‌ఫోన్లు, ఒక ఫ్యాషన్ ప్రో బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రంగారెడ్డి జిల్లా యాలాల మండలం జక్కంపల్లికి చెందిన వడ్డిచెర్ల రాజుగా గుర్తించారు. అతడు రైళ్లలో దారి దోపిడీకి పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈనెల 22న తిరుపతి-నిజామాబాద్ రైలు, రాయలసీమ ఎక్స్ ప్రెస్‌లో వేర్వేరు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువ రూ.1.75 లక్షలు ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. నిందితుడిపై బ్యాగులు, ఫోన్ల దొంగతనం నేరం కింద కేసు నమోదు చేశారు. గతంలో ఇతడిపై తాండూరు పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌పీ బీ.ప్రవీణ్‌కుమార్, రైల్వే పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దొంగను పట్టుకుని అరెస్ట్ చేసినందుకు హైదరాబాద్ రైల్వేస్, రోడ్ సేఫ్టీ అధికారులు అభినందనలు తెలిపారు.

ఎర్రగడ్డలో మహిళ దారుణ హత్య

అమీర్‌పేట్, మార్చి 27:గుర్తు తెలియని ఓ మహిళ గత కొంతకాలంగా ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ పరిసరాల్లో ఉంటూ భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఈ క్రమంలో నల్లగొండకు చెందిన నాగరాజు(35) అనే వ్యక్తి బుధవారం రాత్రి ఆ మహిళతో మాటలు కలిపి ఆమెను భరత్‌నగర్ బ్రిడ్జి కింద కేజీఎన్ చికెన్ సెంటర్ వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి శారీరకంగా కలిశాడు. ఆ తర్వాత తీవ్రంగా కొట్టగా..ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గురువారం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సనత్‌నగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, అక్కడి సీసీ కెమెరాల్లోని ఫుటేజీ ఆధారంగా నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

డిజిటల్ అరెస్ట్ చేయబోయి.. జైల్లోకి!

ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు


అరెస్టయిన ముగ్గురు నిందితులు

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ): డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం చేసి డబ్బులు దోచుకున్న ముగ్గురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు చెప్పిన ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన వీరబోయిన సాయిరాజ్ గత సంవత్సరం నవంబర్ 28వ తేదీన తనకు ఓ సెల్ నుంచి నుంచి కాల్ వచ్చిందని, సైబర్ నేరస్తుడు తాను ముంబై బాంద్రాలోని కుర్లా పీఎస్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ సంజయ్‌పాటిల్‌గా పరిచయం చేసుకున్నాడని తెలిపారు. ఆ తర్వాత కోర్టులో సాయిరాజ్‌పై ఓ కేసు నమోదైందని, అతడి అకౌంట్ నుంచి రూ.25లక్షల మనీలాండరింగ్ జరిగినట్లు బెదిరించాడు. ఆ తర్వాత స్కైప్ కాల్‌కు రమ్మని చెప్పి ఆ మొత్తం అమౌంట్‌ను తన అకౌంట్‌కు వెరిఫికేషన్ కోసం ట్రాన్స్‌ఫర్ చేయమని అడిగితే తాను అలా చేయలేదని, తన దగ్గర అంత డబ్బులు లేవనడంతో తామే లోన్ ఇస్తామంటూ ముందుగా కొన్ని డబ్బులు పంపమని చెప్పి రూ.3,57,998 రెండు దఫాలుగా వారి అకౌంట్‌కు పంపించాడని, దీనికి అతడికి పోలీస్ క్లియరెన్స్ కూడా ఇస్తామని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. తర్వాత తాను మోసపోయినట్లు గ్రహించడంతో సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించారని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులు గుంటూరుకు చెందిన తోట శ్రీనివాసరావు, లామ్ జీవన్‌కుమార్, తమ్మిశెట్టి రఘువీర్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అయితే నిందితుల్లో తోటశ్రీనివాసరావు, లామ్‌జీవన్‌కుమార్ ఇద్దరూ ఫిజియోథెరపిస్ట్‌లుగా పోలీసులు పేర్కొన్నారు. ఈ ముగ్గురిపై దేశవ్యాప్తంగా 14 కేసులున్నాయని, తెలంగాణలో ఒక కేసు నమోదైందని పోలీసులు తెలిపారు.

కస్టమర్లుగా వచ్చి..ఆభరణాలు తస్కరించి..

ఖైరతాబాద్, మార్చి 27: బంగారం షోరూమ్‌కు కస్టమర్లుగా వచ్చి చాకచక్యంగా ఆభరణాలను తస్కరించిన ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సోమాజిగూడలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఈనెల 20వ తేదీన పలువురు మహిళలు వచ్చారు. బంగారు గాజులను చూపించాలని సేల్స్‌మెన్‌ను కోరారు. కొన్ని గాజుల తెచ్చి వారి ముందు ఉంచారు. దీంతో మరిన్ని ఆభరణాలు చూపించాలని కోరగా, సేల్స్‌మెన్ ఆ పనిలో ఉన్నాడు. అదే అదునుగా భావించిన ఓ మహిళ తన వెంట తెచ్చుకున్న డూప్లికేట్ గాజులను పెట్టి ఒరిజినల్‌ను తస్కరించారు. కొద్ది సేపటికి ఎలాంటి కొనుగోలు చేయకుండానే వెళ్లిపోయారు. ఇటీవల క్రాస్ చెకింగ్ సందర్భంగా డూప్లికేట్ గాజులను గుర్తించారు. వెంటనే సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా, 20వ తేదీన బంగారు గాజులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిలో ఓ మహిళ ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దొంగిలించిన బంగారం 54.89 గ్రాములు ఉంటుందని పోలీసులు తెలిపారు. షోరూమ్ హెడ్ జితేష్ కేఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సైబర్ మోసంతో కోల్పోయిన రూ.9.50లక్షల చెక్కును బాధితుడికి అందిస్తున్న సైబర్‌క్రైమ్ పోలీసులు

సైబర్‌మోసంతో పోయిన సొమ్ము.. తిరిగి అప్పగింత

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ): సైబర్ క్రైమ్ హైదరాబాద్ పోలీసులు ఓ వ్యక్తి తాను సైబర్ మోసానికి గురై కోల్పోయిన సొమ్మును రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి సైబర్ నేరగాళ్లు చెప్పిన మాయమాటలు నమ్మి తన బిజినెస్ కోసం రూ.9,50,531లను వివిధ అకౌంట్లకు పంపాడు. తర్వాత వారు మోసం చేశారని తెలుసుకుని సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. న్యూఢిల్లీకి చెందిన నేరస్తుడిని పట్టుకుని వారి నుంచి మొత్తం సొమ్మును రికవరీ చేశామని, ఆ సొమ్మును గురువారం సదరు బాధితుడికి చెక్కు రూపంలో అందజేసినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ఎస్ఐ అభిషేక్, హెడ్‌కానిస్టేబుల్ సతీశ్, పీసీలు శ్రీనివాసరెడ్డి, క్రాంతికుమార్‌రెడ్డిలను సైబర్ క్రైమ్ ఉన్నతాధికారులు అభినందించారు.

తుపాకీతో ఓపెన్ టాప్ జీపులో హల్‌చల్

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, మార్చి 27: అర్ధరాత్రి వేళ ఓపెన్ టాప్ జీపులో ప్రయాణిస్తూ చేతిలో తుపాకీతో హల్‌చల్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారా హిల్స్ రోడ్ నంబర్ -1 లోని సర్వీ హోటల్ సమీపంలో కొంతమంది యువకులు ఓపెన్ టాప్ జీప్ లో అతివేగంగా ప్రయాణిస్తూ గట్టిగా కేకలు వేస్తుండటంతోపాటు రోడ్డు పై వెళ్లే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ వీడియో ఇన్‌స్టాగ్రామ్ లో వైరల్ అయింది. ఆ వీడియోలో యువకుల్లో ఒకరు తన చేతిలో తుపాకీ గాల్లోకి చూపిస్తూ హల్‌చల్ చేశారు. దీంతో ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తించిన బంజారాహిల్స్ పోలీసులు సుమోటో గా ఆక తాయిలపై బీఎన్ ఎస్ 125, 292,351(2) తో పాటు ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

పని చేస్తున్న సంస్థకే టోకరా.. ఇద్దరిపై కేసు

బంజారాహిల్స్, మార్చి 27: పనిచేస్తున్న సంస్థ లావాదేవీలలో అవకతవకలకు పాల్పడిన ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10(సి)లోని గాయత్రి హిల్స్ లో పారిజాత హోమ్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థ ఆఫీస్ ఉన్నది. గత కొంతకాలంగా సంస్థలో ఆర్. గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి అకౌంటెంట్ గా, చంద్రకాంత్ అనే వ్యక్తి ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. ఇటీవల సంస్థకు సంబంధించిన స్టేట్మెంట్లు పరిశీలిస్తుండగా.. కొన్ని అవకతవకలు జరిగినట్లు తేలింది. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ చేయగా.. సంస్థకు చెల్లించాల్సిన డబ్బులను గోవర్ధన్ రెడ్డి, చంద్రకాంత్ తమ అకౌంట్లోకి మళ్లించుకున్నట్లు గుర్తించారు. సుమారు రూ. 17 లక్షల మేర వారిద్దరూ కలిసి కాజేశారని సంస్థ చైర్మన్ టి.అంజయ్య గురువారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వారిదరిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రూ.70వేలు టోకరా

సోదరిలా ఇన్ స్టాగ్రామ్‌లో టెక్కీకి మెసేజ్ పంపిన సైబర్

వెంగళరావునగర్, మార్చి 27: ఆపదలో ఉన్న సోదరిలా ఇన్ స్టా గ్రామ్ లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఓ మెసేజ్ పంపి రూ.70 వేలు కాజేశాడు సైబర్ కేటుగాడు. ఎస్ఆర్.నగర్ పోలీసుల కథనం ప్రకారం.. అమీర్ పేట్ ధరమ్ కరమ్ రోడ్డులో నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీధర్ వారణాసి(45)కి ఈనెల 25వ తేదీన వరుసకు సోదరైన లావణ్య పేరు మీద ఇన్‌స్టాగ్రామ్ లో ఓ మెసేజ్ వచ్చింది. సోదరి అని భావించిన శ్రీధర్ చాటింగ్ చేశాడు. తనకు డబ్బు అత్యవసరంగా ఉందని వచ్చిన మెసేజ్‌ను చూసి సోదరికి సాయపడాలని భావించాడు. అకౌంట్ కు రూ.30 వేలు పంపగా..అవి రాలేదని చెప్పడంతో మరోసారి మళ్లీ రూ.30 వేలు పంపాడు. అలా శ్రీధర్ తన అకౌంట్ నుంచి మొత్తం రూ.70 వేలు పంపాడు. అనుమానం కలుగడంతో సైబర్ నేరగాళ్ల పనేనని గుర్తించాడు. బాధితుడు శ్రీధర్ ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై లైంగిక దాడి.. యువకుడి అరెస్టు

సైదాబాద్, మార్చి 27 : పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ సతీశ్ తెలిపిన ప్రకారం..సైదాబాద్ కరణ్ బాగ్‌కి చెందిన యువతి(23)ని ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకుంటానని చాదర్ ఘాట్ కాలాడేరా ప్రాంతానికి చెందిన హరిసింగ్(26) అనే యువకుడు మాయ మాటలు చెప్పి నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడు. ఇటీవల ఆ యువతి తనను పెండ్లి చేసుకోవాలని నిలదీయగా.. అతడు ముఖం చాటేస్తూ పెండ్లికి నిరాకరించాడు. దీంతో సదరు యువతి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. యువకుడిపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురు మైనర్ల అరెస్ట్

మియాపూర్, మార్చి 27: రోడ్డు పై వాకింగ్ చేస్తున్న ఓ వ్యక్తి మేడలో నుంచి గొలుసు లాక్కెళ్లిన ముగ్గురు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి జువైనల్ హోమ్ కు తరలించారు. ఈనెల 23వ తేదీన రాత్రి 7:45గంటల సమయంలో ముగ్గురు బాలురు ద్విచక్ర వాహనంపై చంద్రబాబు నాయుడు గెస్ట్ హౌస్ సమీప రోడ్డులో వెళ్తున్నారు. అదే రోడ్డులో నార్సి ఎస్టేట్ లెగ్జీరియో రెసిడెన్సి లో నివాసముంటున్న చొప్పారపు రాజా పూర్ణ చందర్రావు వాకింగ్ చేసి వెళ్తుండగా.. వెనుక నుంచి ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై వచ్చి పూర్ణచందర్రావు మెడలో నుంచి గొలుసును లాక్కుని వెళ్లిపోయారు. దీంతో పూర్ణచంద్రావు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీఎస్, మియాపూర్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిందితులైన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా.. చైన్ స్నాచింగ్ కు పాల్పడింది తామేనని అంగీకరించారు. వారి వద్ద నుంచి మూడు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని వారిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-330722

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-329213

★మీ బంగారం మణప్పరం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916, స్పాట్ క్యాష్. NT-330718

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రో